సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 10 । మార్చి । 2023



ఆయిల్‌పామ్‌తో లాభాలు
ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. - 10లో



ప్రజా ఉద్యమం రావాలి
మరో ప్రజా తెలంగాణ ఉద్యమానికి సిద్ధం కావాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. -10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36° / 19°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

అర్హులకు పోడు హక్కు

- ఇప్పటికే 1977 మందికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయం
- తమకు న్యాయం చేయాలంటూ కొందరి వేడుకోలు
- ఆ మేరకు పునః పరిశీలన చేస్తున్న యంత్రాంగం
- మరో 281 మందిని అర్హులుగా తేల్చిన అధికారులు
- ప్రభుత్వ ఆదేశాలు రాగానే పాస్ పుస్తకాల పంపిణీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో పోడు భూములు పొందేందుకు అర్హులైన రైతుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల జిల్లాస్థాయిలో పరిశీలన అనంతరం 1,977 మందిని లబ్ధిదారులుగా అధికారులు తేల్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా వారి మరింతగా పెరుగనుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తమకు అన్యాయం జరుగుతోందని, తమ పేర్లను సబ్ డివిజన్ స్థాయి కమిటీకి, జిల్లా కమిటీకి పంపలేదని కొంతమంది గిరిజనులు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు విజ్ఞప్తులు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చిన విజ్ఞప్తులను, అర్హులు చెబుతున్న కారణాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఇప్పటివరకు జరిపిన పునః పరిశీలన ప్రకారం లబ్ధిదారుల సంఖ్య 2,258కి చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

గ్రామ స్థాయి నుంచి వచ్చిన సిఫారసులు తక్కువే..

ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఆ భూములపై ఎలాంటి హక్కులు లేవు. దీంతో 2005 కంటే ముందు సాగులో ఉన్న వారికి హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామస్థాయి, సబ్ డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో పరిశీలించి (రికగ్నిజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) హక్కులు కల్పించాలని నిర్ణయించింది. గ్రామ స్థాయిలో స్థానికులతో ఫారెస్ట్ రైట్స్ కమిటీలను (ఎఫ్‌ఆర్‌సీ) ఏర్పాటు చేసింది. జిల్లాలోని 13 మండలాల్లో 20,446 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఎఫ్‌ఆర్‌సీలు పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే చేసి కేవలం 3,285 మంది దరఖాస్తులను మాత్రమే సబ్ డివిజన్ కమిటీకి సిఫారసు చేశారు.

గిరిజనేతరులకు కష్టమే

పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనేతరులకు ఆ భూములపై హక్కులు లభించేలా లేవు. ప్రభుత్వం జారీ చేసిన విధి విధానాల ప్రకారం గిరిజనేతరులైతే వారి మూడు తరాల వారు పోడు వ్యవసాయం చేస్తున్నట్లుగా ఆధారాలు అవసరం. లేదంటే 75 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నట్లుగా ఆధారాలు చూపించాలి. ఈ ఆధారాలను పోడు వ్యవసాయం చేస్తున్నామని దరఖాస్తు చేసుకున్న గిరిజనేతరులు ఎవరూ చూపించలేకపోయారు. దీంతో గ్రామ స్థాయిలోని ఎఫ్‌ఆర్‌సీ పరిధిలోనే 17,161 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే పంపిణీ

"పోడు వ్యవసాయం చేస్తున్న వారిలో అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. వారికి ఇచ్చేందుకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే పంపిణీ చేస్తాం. ఎఫ్‌ఆర్‌సీలు సిఫారసు చేసిన లబ్ధిదారుల జాబితాను సబ్ డివిజన్ స్థాయిలో పరిశీలన జరిపారు. మరోవైపు గిరిజనులనుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పరిశీలన జరిపించేలా చర్యలు చేపట్టాం.
– భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్

పునః పరిశీలనతో పెరుగుతున్న లబ్ధిదారులు

ఎఫ్‌ఆర్‌సీ సిఫారసు చేసిన వాటిల్లో సబ్ డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో ఎక్కువే ఆమోదం పొందాయి. 1977 మంది దరఖాస్తులకు అధికారులు ఓకే చెప్పారు. వారి పరిధిలో 3,400 ఎకరాల భూమిపై హక్కు కల్పించేలా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు సిద్ధం చేశారు. గ్రామ స్థాయిలో తమకు అన్యాయం జరుగుతోందంటూ కొంతమంది జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించి విజ్ఞప్తులు చేశారు. దీంతో వచ్చిన విజ్ఞప్తులపై అదనపు కలెక్టర్ అటవీ శాఖ అధికారులతో చర్చించారు. అర్హులైన గిరిజనులకు హక్కులు లభించేలా చూడాలని స్పష్టం చేశారు. దీంతో అటవీ శాఖ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇప్పటివరకు మరో 281 మందిని అర్హులుగా తేల్చారు. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 2,258 మంది గిరిజనులకు దాదాపు 4 వేల ఎకరాలపై హక్కులు లభించనున్నాయి. ఇందులో రెండు మూడు చోట్ల పోడు వ్యవసాయం చేసిన వారిని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే ఒక్కో లబ్ధిదారునికి గరిష్ఠంగా 10 ఎకరాలకు మించి ఇవ్వకుండా చర్యలు చేపట్టారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లాలో పరీక్షలకు 19,414 మంది విద్యార్థులు హాజరవుతున్నారని.. ఇందు కోసం 107 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీబుద్దీన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి వ్యాయామం అవసరం



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : పోలీస్‌లు విధి నిర్వహణలో ఒత్తిడికి గురికాకుండా రోజు యోగా, వ్యాయామం చేయాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండెపోటు నుంచి ప్రజలను రక్షించేలా పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యం కోసం పోలీస్ కుటుంబ సభ్యులంతా రోజూ యోగా, వ్యాయామం చేయాలని కోరారు. మహిళ పోలీస్‌లు, మహిళలు గైనిక్, థైరాయిడ్, చర్మ సంబంధ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్‌రావు, డీఎస్పీలు నర్సింహారెడ్డి, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ సుచరిత, వైద్యులు గౌరిశ్రీ, సునీత, అమరేందర్, రుక్మిణి రావు, అనితారాణి, పుల్లారావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

15 నుంచి ఒంటిపూట బడులు

నల్లగొండ : ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్లాసులు కొనసాగనున్నాయి. అయితే, పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సడలింపు ఇచ్చారు. ఏప్రిల్ 10 నుంచి 17 వరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులటకు సమ్మెటివ్ అసెస్మెంట్–2 వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఏప్రిల్ 25 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి.

నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న మానిటరింగ్ టీం సభ్యులు

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధనను అందించాలని ఎస్‌సీఈఆర్‌టీ మానిటరింగ్ టీం సభ్యులు నన్నూరి ఉపేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి సూచించారు. చిట్యాల మండలంలోని చిట్యాల, వనిపాకల, వట్టిమర్తి గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్‌లను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి.. అంచనా వేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు ఉత్తమైన బోధన అందించేందుకుగాను తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో టీం సభ్యురాలు సువర్ణవినాయక్, మండల నోడల్ ఆఫీసర్ సిహెచ్.నరసింగరావు, హెచ్‌ఎంలు మాధవి, సైదులు పాల్గొన్నారు.

నేడు రాజీవ్ స్వగృహ ప్రీబిడ్ సమావేశం

నల్లగొండ : నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో ఎంజీ యూనివర్సిటీ ఎదురుగా రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్ షిప్‌లో ప్లాట్ల వేలానికి సంబంధించి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లో ప్రీబిడ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడతలో ఓపెన్ ప్లాట్లు (133), పాక్షిక నిర్మాణ గృహాలు (253) విక్రయానికి ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ (సెల్ నంబర్ 91543 39209)ను ఫోన్‌చేయాలని సూచించారు.

పలువురికి పదోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

నల్లగొండ : జిల్లా పరిషత్‌లో ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న 8 మందికి బుధవారం రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు గురువారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా వారికి ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, రాంబాబు, సోమేష్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని రూ.6.25 కోట్లతో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కొత్త భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నర్సింహ, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, చీర పంకజ్ యాదవ్, కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, సమీ, బోయినపల్లి శ్రీనివాస్, కొమ్ము శంకర్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలతో పాటు బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 17 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు జనచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను కులాల, మతాల మధ్య చిచ్చుపెడుతూ మతోన్మాద భావజాలాన్ని వ్యాప్తి చేయాలని కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేషం, శ్రీశైలం, నాగార్జున, నాగిరెడ్డి, కందాల ప్రమీల, సయ్యద్‌హాషం, ప్రభావతి,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

అడవిదేవులపల్లి : మండలంలోని చిట్యాల గ్రామం నుంచి యాదాద్రి థర్మల్ ప్లవర్ ప్లాంటుకు ఏర్పాటు చేస్తున్న పైపులైన్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన అడవిదేవులపల్లి గ్రామం నుంచి వెళ్తున్న పైపులైన్లను పరిశీలించారం అనంతరం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పైపులైన్ల నిర్మాణంలో చాలామంది రైతులు భూములు కోల్పోయారని.. వారందరికీ పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట జెన్‌కో ఏడీ సుందర్ నాయక్, డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, సివిల్ ఏఈ సుదీర్, చింతల వీరయ్య, బ్రహ్మయ్య, ఆదినారాయణ, పిచ్చయ్య తదితరులున్నారు.

విషజ్వరాలతో బెంబేలు



నల్లగొండలోని జిల్లా జనరల్ ఆస్పత్రి వార్డులో రోగులు

- ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులు
- ఫ్లూ లక్షణాలు కనిపిస్తున్నాయంటున్న వైద్యులు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు

నల్లగొండ టౌన్ : విష జ్వరాల మళ్లీ విజృంభిస్తున్నాయి. ఎప్పుడైనా చలికాలంలో ఫ్లూ కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతుంటారు. కానీ, ప్రస్తుతం ఎండలు ముదురుతున్న సమయంలో ఫ్లూ లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరగడం ఒకింత ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జ్వర బాధితుల్లో హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు ఉన్నట్లు గుర్తించడం వైద్య ఆరోగ్యశాఖను కొంత కలవరపాటుకు గురి చేస్తోంది. అనేక ప్రాంతాల్లో రోగులు దగ్గు, జలుబు, స్వరం, కళ్ల మంటలు, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రులు, నకిరేకల్, మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఫ్లూ లక్షణాలతో ఓపీ (అవుట్ పేషంట్) సేవల కోసం వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి అన్ని ఆస్పత్రుల్లో జనరల్ మెడిసిన్ ఓపీ చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం గమనార్హం. వైద్యం కోసం వస్తున్న వారిలో 15 నుంచి 20 శాతం వరకు విష జ్వరాలతో ఫ్లూ లక్షణాలతో చికిత్సకు వస్తున్న వారు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఫ్లూ నిర్ధారణ కానప్పటికీ ఆ లక్షణాలు కనిపిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం సీతాకాలం ముగిసి వేసవికాలం ప్రారంభమై పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా.. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వైరస్ కారకాలలో మార్పులు వస్తున్నట్లు వైద్యులు విశ్లేషిస్తున్నారు. సాధారణ ఫ్లూ కంటే ప్రస్తుతం వస్తున్న ఫ్లూ తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

అప్రమత్తం చేసిన ప్రభుత్వం..

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు గురువారం ఆస్పత్రుల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైద్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిసింది. జ్వరాల బారినపడి చికిత్స కోసం వచ్చే రోగులకు సరైన వైద్య సేవలను అందించాలని, అవసరమైతే ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అవసరమైన అన్ని రకాల మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రోగుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించినట్లు తెలిసింది.

ఆందోళన చెందాల్సిన పనిలేదు



"ప్రతి సీజన్‌లో వచ్చే ఫ్లూ లాగానే ప్రస్తుతం ఉన్న ఫ్లూతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. దీని విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మామూలు జ్వరాల మాదిరిగానే చికిత్సలు తీసుకుంటే తగ్గుతుంది. అయితే జ్వరంతో ఉన్నవారు జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తిరగకూడదు, విధిగా మాస్కను ధరించాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ



క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి..

- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిట్యాల ఎస్‌ఐ ఎన్‌. ధర్మా గురువారం తెలిపారు. వివరాలు.. రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల సైదులు(35) ఈ నెల 5వ తేదీన చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సైదులును కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌ వాసి..

చౌటుప్పల్‌: మండలంలోని దండు మల్కాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ సీత పాండు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌ పట్టణ కేంద్రానికి చెందిన కూరపాటి మత్స్యగిరి(27) బైక్‌పై ఈ నెల 2న తన అత్తగారి ఊరైన రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్లాడు. అదే రోజు తిరిగి చౌటుప్పల్‌కు వస్తుండగా దండుమల్కాపురం గ్రామపంచాయతీ పరిధిలోని బొర్రోళ్లగూడెం స్టేజీ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్‌: హోలీ రోజు నాగార్జునసాగర్‌ ఎడమ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన ఆవులదొడ్డి అజయ్‌కుమార్‌(20) హోలీ రోజు స్నానం చేసేందుకు మిర్యాలగూడ మండల శివారులోని సాగర్‌ ఎడమ కాలువ వద్దకు వెళ్లాడు. అతడికి ఈత రాకపోవడంతో ఒడ్డున ఉండి స్నానం చేస్తుండగా కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. కాగా గురువారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌ మండలంలోని దోసపహాడ్‌ బ్రిడ్జి వద్ద అజయ్‌కుమార్‌ మృతదేహం లభ్యమైంది. అజయ్‌కుమార్‌ తండ్రి గతంలోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, తల్లి రమణ స్థానికంగా ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ ఇద్దరు కుమారులను చదివిస్తోంది. పెద్ద కుమారుడైన అజయ్‌కుమార్‌ డిగ్రీ చదువుతూనే పార్ట్‌ టైం జాబ్‌ చేస్తూ తల్లికి చేదోడుగా ఉంటున్నాడు.

బావిలో పడి యువకుడి మృతి

- హోలీ రోజు ఘటన, రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం


స్వామి (ఫైల్‌)

భూదాన్‌పోచంపల్లి: స్నానం చేసేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి యువకుడు మృతిచెందిన ఘటన పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీతావానిగూడెం గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతావానిగూడెం గ్రామానికి చెందిన ఒంటెద్దు నర్సింహ, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు స్వామి(22) సంతానం. కాగా స్వామి పట్టణ కేంద్రంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కాగా ఈ నెల 7వ తేదీన హోలీ పండుగ రోజున గ్రామంలో స్నేహితులతో కలిసి హోలీ ఆడిన స్వామి మధ్యాహ్నం సమయంలో స్నానం చేయడానికి గ్రామ సమీపంలోని మేడిబావి వద్దకు వెళ్లాడు. బావి ఒడ్డుపై దుస్తులు, చెప్పులు విడిచి బావిలోని దూకాడు. బావిలోని బురదలో కూరుకుపోయి ఊపిరిరాడక మృతిచెందాడు. ఉదయం హోలీ ఆడటానికి బయటికి వెళ్లిన కుమారుడు రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తమకు తెలిసిన వారి ఇళ్లలో వెతకడం ప్రారంభించారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఒంటెద్దు కిష్టయ్య విద్యుత్‌ మోటారు పెట్టడానికి బావి వద్దకు వెళ్లగా ఒడ్డుపై దుస్తులు, చెప్పులు కనిపించాయి. కిష్టయ్య ఈ విషయాన్ని స్వామి తల్లి పద్మకు చెప్పడంతో ఆమె వెంటనే బావి వద్దకు చేరుకొని దుస్తులు, చెప్పులు చూసి అవి తన కుమారుడివేనని గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చౌటుప్పల్‌ రూరల్‌ సీఐ మహేశ్‌, ఎస్‌ఐ సైదిరెడ్డి, చౌటుప్పల్‌ ఫైర్‌ సిబ్బంది సహాయంతో బావిలో మోటార్లు పెట్టి రాత్రంతా నీటిని తోడారు. కాగా గురువారం ఉదయం బావిలోని బురదలో కూరుకపోయిన స్వామి మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చేతికందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.


ప్రమాదం జరిగింది ఈ బావిలోనే..

శ్రీగంధం తోటలో చెట్లను నరికి..

- దుంగలను ఎత్తుకెళ్లిన దుండగులు
- వాటి విలువ రూ.30లక్షలకు పైనే..

కోదాడరూరల్‌: శ్రీగంధం తోటలో దుండగులు చొరబడి 19 చెట్లను నరికి తీసుకెళ్లిన సంఘటన కోదాడ మండల పరిధిలోని దొరకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన రాఘవరావు దొరకుంట గ్రామ శివారులో తనకున్న ఏడెకరాల భూమిలో శ్రీగంధం తోట సాగుచేస్తున్నాడు. దాదాపు 10 ఏళ్ల కిందట నాటిన శ్రీగంధం మొక్కలు ప్రస్తుతం ఐదు అడుగుల మేర పెరిగి చెట్లుగా మారాయి. వాటికి రక్షణగా చుట్టూ సోలార్‌ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి ఇద్దరు కూలీలను కూడా కాపలా పెట్టాడు. అయితే ఫిబ్రవరి 28న ఒకసారి, రెండు రోజుల క్రితం మరోసారి రాత్రి సమయంలో దుండగులు సోలార్‌ ఫెన్సింగ్‌ను కత్తిరించి తోటలోకి చొరబడి 19 చెట్లను నరికి తీసుకెళ్లారు. మరో 30 చెట్లకు గాట్లు పెట్టడంతో పాటు కొమ్మలను వారి వెంట తీసుకెళ్లి, కాండాలను అక్కడే వదిలేసినట్లు బాధితుడు తెలిపాడు. దుండగులు దొంగిలించిన చెట్ల విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని పేర్కొన్నాడు. ఈ ఘటనపై గురువారం కోదాడ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.


దుండగులు నరికిన శ్రీగంధం చెట్ల కొమ్మలు

కారెక్కించుకున్నారు.. దోచుకొని వెళ్లారు

- ప్రయాణికుడి వద్ద రూ.10వేల నగదు, సెల్‌ఫోన్‌ ఎత్తుకెళ్లిన దుండగులు

చౌటుప్పల్‌: రోడ్డుపై బస్సు కోసం వేచిచూస్తున్న వ్యక్తిని కారులో ఎక్కించుకున్న దుండగులు దారి మధ్యలో అతడిపై దాడి చేసి దోచుకున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామం వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. చౌటుప్పల్‌ మండల పరిధిలోని పీపల్‌పహాడ్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పని నిమిత్తం బుధవారం రంగారెడ్డి జిల్లా పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు సిద్ధమై 65వ నంబర్‌ జాతీయ రహదారిపై బస్సు కోసం వేచి చూశాడు. ఎంత సేపటికీ బస్సులు రాకపోవడంతో ప్రైవేట్‌ వాహనాల్లోనైనా ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌ నుంచి చౌటుప్పల్‌ వైపు వెళ్లే ప్రైవేట్‌ వాహనాలను ఆపసాగాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ కారు డ్రైవర్‌ ఇతడిని చూడగానే కారును ఆపాడు. ఎక్కడికి వెళ్లాలంటూ వాకబు చేశాడు. అప్పటికే కారులో మరో ఐదుగురు వ్యక్తులు కూడా ఉన్నారు. వారు కూడా తన మాదిరిగానే ప్రయాణికులుగా భావించిన సదరు వ్యక్తి కారెక్కి కూర్చున్నాడు. మార్గమధ్యలో చౌటుప్పల్‌ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని ఆంథోల్‌ మైసమ్మ దేవాలయం సమీపంలోకి వెళ్లగానే కారును చెట్లల్లోకి తీసుకెళ్లారు. సదరు వ్యక్తిని కారు నుంచి దింపి అందులోని వ్యక్తులందరూ అతడిని బెదిరించి రూ.10వేల నగదు, సెల్‌ఫోన్‌ లాక్కొని ఉడాయించారు. అక్కడి నుంచి ఎలాగో అలా బయటపడిన బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఓ పోలీస్‌ అధికారి తెలిపారు.

రంగురాళ్లు తరలిస్తున్న లారీ పట్టివేత


ముదిమాణిక్యంలో పట్టుబడిన లారీ, ఇన్‌సెట్‌లో రంగు రాళ్లు

అడవిదేవులపల్లి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామ సమీపంలో కృష్ణానది ఒడ్డున బుధవారం అర్ధరాత్రి రంగురాళ్ల లారీని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ లారీని మైనింగ్‌ అధికారులకు అప్పగించనున్నట్లు గురువారం పోలీసులు తెలిపారు. అడవిదేవులపల్లి మండలంలోని అడవిదేవులపల్లి, చిట్యాల, ముదిమాణిక్యం ప్రాంతాల్లో కృష్ణానది తీరంలో వివిధ సైజులలో రంగురాళ్లు లభిస్తాయి. కొంతకాలంగా రంగురాళ్లను సేకరించి హైదరాబాద్‌, ముంబై, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండానే కొందరు ఈ ప్రాంతం నుంచి రవాణా చేస్తున్నారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో రంగురాళ్ల తరలింపు అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా సాగుతోంది.

విద్యుత్‌ మోటార్ల దొంగలు అరెస్ట్‌


స్వాధీనం చేసుకున్న విద్యుత్‌ మోటార్లను చూపుతున్న పోలీసులు

నేరేడుచర్ల: విద్యుత్‌ మోటార్లను చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఆయన ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు. వివరాలు.. నేరేడుచర్లకు చెందిన గోలి సైదులు, పోరెడ్డి నాగేందర్‌రెడ్డి, షేక్‌ మదార్‌సాబ్‌ మద్యానికి బానిసలై మండలంలోని జానలదిన్నె, మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామ శివారుల్లో కాలువలు, చెరువులు, బావుల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్‌ మోటార్లను చోరీ చేశారు. చోరీ చేసిన ఐదు విద్యుత్‌ మోటార్లలో రెండింటిని నేరేడుచర్లలోని పాత ఇనుప దుకాణంలో అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా, పక్కా సమాచారం మేరకు వారిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి వ్యవసాయ విద్యుత్‌ మోటార్లు, బైక్‌తో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

నేరేడుచర్ల: రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన బండి సతీష్‌ నేరేడుచర్ల నుంచి దిర్శించర్ల వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన అమరారపు నాని, అమరారపు జయంతి దిర్శించర్ల నుంచి నేరేడుచర్ల వైపు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బండి సతీష్‌, అమరారపు నాని, జయంతికి గాయాలయ్యాయి. స్థానికులు ముగ్గురిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్‌ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ తెలిపారు.


ప్రమాదంలో గాయపడిన సతీష్‌

సారా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు

- 11మందిపై కేసులు నమోదు

హుజూర్‌నగర్‌: నియోజకవర్గంలోని సారా తయారీ స్థావరాలపై గురువారం ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు దాడులు నిర్వహించి 11 మందిపై కేసులు నమోదు చేశారు. హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్‌ కార్యాలయంలో ఎక్సైజ్‌ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా, స్టేట్‌ ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు సంయుక్తంగా మేళ్లచెరువు మండల పరిధిలోని హేమ్లాతండా, గాంధీనగర్‌ తండాల్లోని సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 8మందిపై కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 30కిలోల బెల్లం, 25కిలోల పటిక, 21 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 550 లీటర్ల సారా తయారీ పానకం ధ్వంసం చేశారు. అదేవిధంగా చింతలపాలెం మండల పరిధిలోని ఎర్రకుంట తండా, మేళ్లచెరువు మండల పరిధిలోని కొత్తతండాల్లో సైతం సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 1,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్‌ఐ తెలిపారు.


సారా తయారీ పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు

గడువులోగా లక్ష్యాలను పూర్తిచేయాలి

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లాలో నిర్ణీత ప్రభుత్వ పథకాలు, రుణాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ శ్రామిక్‌ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి సంయుక్త బ్యాంకర్ల, అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రుణ పథకాలు, స్వయం సహాయక సంఘాలు, సంఘ బంధాలకు వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి పథకాలు సత్వరం పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో రుణ లక్ష్యంలో 80శాతం పూర్తయిందని, మరో 20శాతం ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాబార్డు అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ వినయ్‌కుమార్‌, ఎంపీఓ వీరారెడ్డి, మెప్మా కోఆర్డినేటర్‌ శివాజీ, ఐకేపీ, ఏఎస్‌ఎంలు కృష్ణమూర్తి, శేషయ్యలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ శ్రామిక్‌

ప్రైవేట్‌ వాహనాలను అనుమతించొద్దు

భువనగిరి టౌన్‌: భువనగిరి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోపలికి ప్రైవేట్‌ వాహనాలను అనుమతించొద్దని ఆ సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్‌ మేనేజర్‌ (ఆర్‌ఎం) శ్రీదేవి అన్నారు. గురువారం సాయంత్రం భువనగిరి బస్టాండ్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ బస్టాండ్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని డిపో మేనేజర్‌ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నీటివసతి కల్పించాలని సూచించారు. ఆమెవెంట యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌ శ్రీనివాస్‌, భువనగిరి బస్‌స్టేషన్‌ మేనేజర్‌ పాషా, సిబ్బంది వివిరావు, వెంకటయ్య ఉన్నారు.

WANTED TRAINED TEACHERS

1) To take IIT & NEET Foundation/Olympiad classes from class VI to X in Mathematics, Physics, Chemistry, and Biology.
Remuneration: Best in industry.
2) Trained Pre Primary, Primary & High School teachers for Hindi, Telugu, Maths, Science, Social Studies, Computer Science and English.
3) Dance and Vocal Music.

Apply on or before 16th March, 2023 in person with Hand written application, mobile Number with latest Passport size Photograph along with all the Photostat copies of testimonials.
Mode of Selection: Written Test, Demo Class and Interview

Correspondent :
THE NALGONDA PUBLIC SCHOOL
(Affiliated to CBSE, New Delhi)
6-2-907, Meerbagh Colony, Hyderabad Road, Nalgonda (T.S.)-508001.
Phone No. 08682 - 224784, Mobile No. 8309824107
Email: tnpsdes@gmail.com

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

మేళ్లచెరువు: వీధి కుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలోని రామాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన సైదా కుమార్తె జయిదా ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. దీంతో చిన్నారి ముఖంపై 6 చోట్ల గాయాలయ్యాయి. చిన్నారిని కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం హుజూర్‌నగర్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కోతి, కుక్కల దాడిలో ఇద్దరికి..

అర్వపల్లి: మండల పరిధిలోని కాసర్లపహాడ్‌, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో వరసగా రెండు రోజుల వ్యవధిలో కోతి, కుక్కల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. కాసర్లపహాడ్‌ గ్రామానికి చెందిన బాసాని ప్రభావతి పొలం వద్దకు వెళ్తుండగా వెనుక నుంచి కోతి వచ్చి మీదపడి కరిచి గాయపరిచింది. అదే విధంగా జాజిరెడ్డిగూడెంలో కాగితాల బాలరాజు 8 ఏళ్ల కుమార్తె కావేరి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క కరిచి గాయపరిచింది. వారం వ్యవధిలో మండల వ్యాప్తంగా పది మందికి పైగానే కుక్క, కోతుల దాడిలో గాయపడినట్లు సమాచారం.

యాదాద్రి ఆలయంలో నిత్య పూజలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు సంప్రదాయ బద్ధంగా కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు చేపట్టారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన వంటి పూజలను జరిపించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ద్వార బంధనం చేశారు.

20 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో హైదరాబాద్‌కు చెందిన నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ మేనేజ్‌మెంట్‌ ఆర్థిక సహకారంతో శాస్త్రీయ పద్ధతిలో ఈనెల 20 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ బి. లవకుమార్‌ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్డ్‌ కులాల రైతులకు ఏడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల షెడ్యూల్డ్‌ కులాల రైతులు కనీస విద్యార్హత 10వ తరగతి చదివి ఉంటే పేరు, ఆధార్‌ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు జతపర్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన వసతి కల్పించనున్నట్లు, సమాచారం కోసం ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్‌ నరేష్‌ సెల్‌ నంబర్లు 9603268682, 9010212711లలో సంప్రదించాలన్నారు.యనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం సస్పెండ్‌

మఠంపల్లి: మండలంలోని భీల్యానాయక్‌తండా జెడ్పీహెచ్‌ఎస్‌ ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం సీహెచ్‌ రాజేష్‌పై సస్పెన్షన్‌ వేటు పడింది. అధికారుల అనుమతిలేకుండానే ఈనెల 8న పాఠశాలకు హోలీ పండుగ సెలవును ప్రకటించారు. దీంతో కలెక్టర్‌ ఆదేశాలతో డీఈఓ అశోక్‌ ఈనెల 8న అతడిని సస్పెండ్‌ చేసి అదే పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్‌. వేణుగోపాల్‌ను ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎంగా నియమించారు. ఈ వివరాలను ఎంఈఓ చత్రునాయక్‌ తెలిపారు.

చదువే భవిష్యత్‌కు పెట్టుబడి

సూర్యాపేటటౌన్‌: మీరు పడే శ్రమ చదువే మీ భవిష్యత్‌కు పెట్టుబడి అని, కసిగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఐఈఓ కృష్ణయ్య, డీఎస్పీ నాగభూషణం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో కాలేజీ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెరీర్‌లో ఇంటర్‌ ఉత్తీర్ణులైతే మీ భవిష్యత్‌కు రాచబాట పడుతుందన్నారు. సెల్‌ఫోన్‌తో సమయం వృథా చేస్తున్నారని, స్మార్ట్‌ ఫోన్‌ లెక్క మీ జీవితాన్ని అందంగా మలుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ తాహేర్‌పాష, ప్రిన్సిపల్‌ పెరుమాళ్ల యాదయ్య, అధ్యాపకులు సైదులు, లింగం, కవిత, కంది శ్రీను, బాల్లు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత అవసరం

నడిగూడెం: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం అవసరమని సూర్యాపేట జిల్లా అటవీశాఖ అధికారి వి.సతీష్‌ కుమార్‌ అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో తాగు నీటి సమస్య లేకుండా మిషన్‌ భగీరథ నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన చెట్లు ఎండిపోకుండా చూడాలన్నారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కనకమ్మ, ఎండి.అఫ్జల్‌ పాల్గొన్నారు.

బీమా క్యాంపులను వినియోగించుకోవాలి

నాగారం : గ్రామాల్లో నిర్వహిస్తున్న తపాలా జీవిత బీమా క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా పోస్టల్‌ సూపరింటెండెంట్‌ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలోని సబ్‌ పోస్టాఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రూరల్‌ పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌తో పాటు డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులకు పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు.

మహిళలు ఇంటికే పరిమితం కావొద్దు

- యాదాద్రి జిల్లా అదనపు జడ్జి మారుతీదేవి

బీబీనగర్‌: మహిళలు ఇంటికే పరిమితం కాకుండా తమ హక్కులపై అవగాహన పెంచుకొని సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలని యాదాద్రి జిల్లా అదనపు న్యాయమూర్తి మారుతీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్‌ ఆధ్వర్యంలో మండలంలోని నెమురగొముల పరిధిలో గల వీఎల్‌ఎన్‌ గార్డెన్‌లో గురువారం నిర్వహించి న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. అనంతరం జూనియర్‌ సివిల్‌ జడ్జి దశరథ రామయ్య మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయపరమైన సలహాలు ఇవ్వడంతోపాటు చట్టాలపై అవగాహన కల్పిస్తూ లోక్‌ అదాలత్‌ ద్వారా కేసుల పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌, ఎంపీడీఓ శ్రీవాణి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ సైదులు, న్యాయమూర్తులు రమేష్‌కుమార్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి మారుతీదేవి


న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరైన మహిళలు

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- సూర్యాపేట కలెక్టర్‌ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అవసరమైన వారికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి వెలుగును విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ ఎస్‌. వెంకట్రావ్‌ ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళలకు నిర్దేశించిన ఎనిమిది ఆరోగ్య సమస్యలపై వైద్య సేవలు అందిచాలన్నారు. జిల్లాలో నూతనంగా చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గుండెపోటు నివారణకు వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ, పోలీసు సిబ్బందికి సీపీఆర్‌ పై తక్షణమే శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో జరుగుతున్న సిజేరియన్లను నివారించాలన్నారు. చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థంగా నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారిలో ఉన్న లోపాలను గుర్తించి తక్షణమే వైద్యసేవలు అందించాలన్నారు. బీపీ, మధుమేహం, క్యాన్సర్‌ పరీక్షలు ఇంటింటికీ వెళ్లి నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కోటాచలం, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మురళీధర్‌ రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్‌, డీఎంహెచ్‌ఓ

సాక్షి క్లాసిఫైడ్స్‌

Education

■ లాస్ట్‌ ఛాన్స్‌ డైరెక్ట్‌ ఫైనల్‌ ఇయర్‌ మార్చి, ఏప్రిల్‌ పరీక్షల్లో 10th, ఇంటర్‌, Any డిగ్రీ, Any PG 100% పాస్‌ గ్యారంటీ, ఫైన్‌తో అడ్మిషన్స్‌ కలవు. లాస్ట్‌ డేట్‌ 2/3/2023 ఫోన్‌. 6305979755. [H-792986]

Real Estate

HOUSE FOR SALE
■ Miryalaguda First Gated Community 92 Luxury Villas Clubhouse, Swimmingpool, Ready to Occupy Just Rs. 1.11 Cr. Call: 7013578378. [H-793345]

Services

■ ఒంటరితనము, వృద్ధాప్యము, అనారోగ్యంతో ఉన్న మీ కుటుంబ సభ్యులను మా కుటుంబ సభ్యుల వలె చూసుకుంటాము. శాంతి ఓల్డేజ్‌ హోం, కోదాడ. సెల్‌ : 9030998827 [Y-784353]

Wanted

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్‌ చూసి కొత్తరికార్డ్స్‌ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్‌ చేయండి. 7730899503 [G-514]

■ అర్జెంట్‌గా సెక్యూరిటీగార్డ్స్‌ కావలెను. మిర్యాలగూడెం దగ్గర కుక్కడంలో పని చేయుటకు. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9959599308 [Y-784322]

■ కోదాడలోని కిట్స్‌ మహిళా ఇంజనీరింగ్‌ కాలేజ్‌లో ఆఫీస్‌ నందు పనిచేయుటకు కంప్యూటర్‌ ఆపరేటర్స్‌ కావలెను. DTP చేసిన వారికి ప్రాధాన్యత సంప్ర॥ సెల్‌ : 8978973332 [Y-784321]

■ వైష్ణవ/శైవ బ్రాహ్మణ పూజారి కావలెను. గ్రా॥ చెట్లచెన్నారం, నల్లగొండ జిల్లా & మండలం సంప్ర॥ 98483 33392, 79891 43612 [Y-784323]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-781947]

■ హైదరాబాద్‌ వృద్ధాశ్రమంలో పనికు పెని॥ లేడీస్‌ టేకర్స్‌, పెని॥ వంటవారు (వ: 35సం॥ ఆపైన) & ఆయాలు కావలెను. మంచి జీతం ఫ్రీ వసతి, భోజన సదుపాయం. సంప్ర: Ph: 9700006699, 7981467036. [H-793526]

ప్రకటన కోరండి! స్పందన పొందండి!!
సాక్షి క్లాసిఫైడ్స్‌
నాలుగు లైన్లకు రూ.:220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్‌ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.